
'బ్రతుకు బుగ్గి చేసిన సారా' కథల పోటీలో
ఈ వారం ఎన్నికయిన కథ

# 'వదినా...మన్నించు'

## డాక్టర్ ప్రసాద్ కల్లూరి




**"అన్నా, ఇప్పటికే ఒక సీసా పూర్తి చేసావు. ఇక చాలన్నా, పోదాం పద" అన్నాడు క్లీనర్ కోటేశం తూలి పోతున్న రంగయ్యతో.**

"రేయ్! నువ్వు నోర్ముయ్. అసలే ఈ రాత్రంతా బండి తోలాల. ఉదయాన్నే నెల్లూరులో డెలివరీ ఇవ్వలేదనుకో, గొడవలయి పోతాయి. ఇంకొక్క రెండు గ్లాసులు వేసుకుంటే నమ్మగా బండి తోలచ్చు." అంటూ మళ్ళీ గ్లాసు నింపుకున్నాడు రంగయ్య. బలవంతంగా బయటకు లాక్కొచ్చేసరికి, అరగంట బట్టింది.

"అన్నా, ఇంటి కాడ వదినమ్మ కారియర్ సర్దింది కదా. రెండు ముద్దలు తినకూడదా. అసలే ఖాళీ కడుపు మీద తాగావు..." అన్నాడు కోటేశం.

"లేదులేరా! రెండు గంటల్లో ఒంగోలు చేరతాం గద. ఇద్దరం అక్కడ తిందాంలే" అంటూ లారీలో ఎక్కి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు రంగయ్య.

అలవాటు ప్రకారం టైర్లు తట్టిచూసి, రైట్ చెబుతూ తన సీట్లో సెటిలయ్యాడు కోటేశం.

నెమ్మదిగా బండి గుంటూరు మిర్చియార్డు కాంపౌండ్‌లోంచి బయటకు వచ్చి, ఒంగోలు వైపు బయలుదేరింది.

రాత్రి దాదాపు ఎనిమిది గంటల సమయం.

ఎదురుగా వచ్చే బండ్లకు టాటా చెబుతూ, హుషారుగా ఉన్నాడు రంగయ్య.

రంగయ్య తాగుడు అలవాటు ఈ నాటిది కాదు.

ఇప్పుడతని వయస్సు ముప్ఫై సంవత్సరాలు. లారీల్లో తిరగడం మొదలుపెట్టి సుమారు ఆరు సంవత్సరాలు.

ఏ ముహూర్తాన బండి ఎక్కాడో తెలీదు, ఆ నాటినుండి అలవాటయింది ఈ దిక్కుమాలిన అలవాటు.

కోటేశం రంగయ్యకు దూరపు చుట్టం. తమ్ముని వరస. తనతోపాటే వుంచుకుంటూ, పని నేర్పించాడు రంగయ్య.

"అవునన్నా! వదినమ్మ కనేది వచ్చే వారమే కదా. ఓ పని చెయ్యకూడదూ. ఈ ట్రిప్పు తోలి, నాల్గురోజులు ఇంటికాడ వుంటే మంచిదేమో ఆలోచించు" అన్నాడు కోటేశం, బీడీ వెలిగించుకుంటూ.

తన నోట్లో ఉన్న బీడీని గట్టిగా ఓ దమ్ములాగి.

"..... నిజమేరా. రాజమ్మకి పురిటొప్పులు వచ్చినప్పుడు పక్కనుంటానని పెమాణం జేశాను. అసలే ఆలీసెంగా వచ్చిన కడుపు. ఎట్లాగా రెండు రోజుల్లో రిటను వచ్చేస్తాంగదా, బండి నాలుగు రోజులు ఇంటికాడే వుంచి రాజమ్మ ఇసయం చూద్దాంలే...." అన్నాడు.

అతని ఆలోచనలు, నెలలు నిండిన రాజమ్మ చుట్టూ తిరుగుతున్నాయి. రంగయ్య స్వతహాగా మంచివాడే.

భార్యంటే ప్రేమ. ఏం సాయం కావాలన్నా చేస్తాడు.

కాని, అతనికున్న బలహీనత ఒక్కటే. సాయంత్రమయితే, ఎక్కడున్నా సారా కొట్టుకు ఈడ్చుకుపోతాయి కాళ్ళు.

ఎంత చెప్పినా, భార్య మాట కాదు కదా, ఎవరి మాటా వినడు, ఆ ఒక్క విషయంలో చెప్పి, చెప్పి, వదిలేసింది, రాజమ్మ.

రాత్రి పది గంటల సమయం.

క్రమంగా పెరుగుతున్న ట్రాఫిక్.

ఫోర్ లేన్ రోడ్ కావడంతో పెద్ద ఇబ్బంది ఏమీ లేదు. అందుకే యాక్సిలేటర్ బాగా తొక్కిపట్టి, స్పీడ్ పెంచాడు రంగయ్య.

డెబ్భై, ఎనభై కిలోమీటర్లు చూపుతోంది, స్పీడోమీటర్.

అది గమనించాడు కోటేశం.

"అన్నా, అసలే మందుమీదున్నావు. అంత స్పీడు వద్దన్నా" అన్నాడు వారిస్తున్నట్లు.

"నోరు ముయ్యరా... ఇదే గుడ్డొచ్చి, పిల్లను

వెక్కిరించడమంటే. నువ్వు చెడ్డీలు వేయక ముందునుంచి, చక్రం తిప్పినోడ్ని. మాట్లాడ కుండా కూర్చో" అన్నాడు కోపంగా.

కోటేశం కిటికీలోనుంచి బయటకు చూస్తూ, వూరకుండిపోయాడు.

అరగంట గడిచింది.

తాగిన సారా మెల్లగా ప్రభావం చూపించింది. మత్తు మెదడుకు పాకడంతో కళ్లు బరువుగా అనిపించాయి రంగయ్యకి.

ఇంతలో ముంచుకొచ్చింది ఉపద్రవం.

రోడ్డు మధ్యన ఉన్న డివైడర్‌లో "మీడియన్ గాపీ" లోంచి, సర్రున కట్ చేసి, రంగయ్య లారీ వస్తున్న రోడ్‌లోకి తిప్పడం, ఒక మినీ లారీ డ్రయివర్. అదీ చాలా వేగంగా.

ఎంత వేగంగా తిప్పాడంటే, గుర్తించే సమయం కూడా దొరకలేదు రంగయ్యకి.

ఆ కంగారులో సర్రున లెఫ్ట్‌కి కట్ చేశాడు రంగయ్య.

అంత స్పీడ్‌లో కట్ చేసేసరికి, లారీకి బాలన్స్ తప్పింది.

తిరిగి స్టడీ చేయాలని అనుకున్నాడే కాని, అతని చేతులు సహకరించలేదు. కండ్లు మత్తుతో అరమోడ్పులయి వున్నాయి.

ఇది అతను గ్రహించేలోపే, లారీ వేగంగా వెళ్లి, రోడ్ ప్రక్కన వున్న చెట్టుకు, బలంగా గుద్దుకుంది.

అంతే, భళ్లున పగిలిన అద్దం, ఆ అద్దం ముక్కల్లో ఒకటి ఫోర్స్‌గా వచ్చి రంగయ్య మెడలో దిగబడింది. చివ్వున చిమ్మిన రక్తం.

ఎడమవైపు కూర్చున్న కోటేశం ఎగిరి రోడ్ మీద పడ్డాడు. ఎడమ చెయ్యి విరిగింది.

చుట్టూ చీకటి. హెడ్ లైట్స్ పగిలిపోయాయి.

ఓపికనంతా కూడ కట్టుకుని, లేచి లారీ పక్కకు వచ్చి, డ్రైవింగ్ సీట్లో ముందుకు వాలి ఉన్న రంగయ్యను కదిపి చూశాడు కోటేశం. చలనం లేదు. ముక్కు దగ్గర వేలు పెట్టాడు. నీరసంగా ఆడుతున్న ఊపిరి. మెడమీద నుంచి కారిన రక్తం చొక్కా మీద పడి గడ్డ కట్టింది. అలాగే క్రిందికి దిగి రోడ్డు పక్కన నిలబడి సాయంకోసం ఎదురుచూశాడు కోటేశం. అరగంట గడిచిన తర్వాత, ఎవరో మహానుభావుడు తన కార్లో గుంటూరు ఆసుపత్రికి తరలించాడు, రంగయ్యని, కోటేశంని.

మరుసటిరోజు ఉదయం... మార్చురీ ప్రాంగణం.

నిర్జీవంగా పడివున్న రంగయ్య మృతదేహం వైపు, నిర్వేదంగా చూశాడు కోటేశం.

విరిగిన తన చెయ్యికన్నా, పోయిన రంగయ్య తాలూకు అభిమానం కొండంత దుఃఖాన్ని కలిగిస్తున్నది.

మెడలో రక్తనాళాలు పూర్తిగా తెగిపోయాయట. అధిక రక్త స్రావం జరగడంతో, డాక్టర్లు కూడా బ్రతికించలేక పోయారుట.

కోటేశం మనసులో భిన్న భావాలు.

దుఃఖం, ఏమీ చేయలేక పోయానన్న బాధ, అన్నిటినీ మించి ఇంతమంది ఉసురుపోసుకుంటున్న 'సారా' మీద, దాన్ని పోషించే వారి మీద ఏదో తెలియని 'కసి'.

ఏం, డబ్బు సంపాదించాలంటే ఇంతకన్నా మార్గాలే లావా?!

సారా కాంట్రాక్టర్లు, వారిని పోషించే రాజకీయ నాయకులు, ఆ నాయకులకు అండగా నిలిచిన ప్రభుత్వం...

ఎవరిని నిలదీయాలి...

కళ్లముందు కనడానికి సిద్ధంగా ఉన్న రాజమ్మ రూపం మెదిలింది...

అతని మనసు మౌనంగా రోదించింది... వదినా! నన్ను మన్నించు.... ✡

**ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.**

**- ఎడిటర్**

## ప్రియదత్త పాఠకులకు ఉచిత వైద్యసదుపాయం

# ఉచిత స్పైన్ ట్యూమర్ ఆపరేషన్లు

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ, మహిళా విభాగంవారి సహకారంతో ప్రముఖ వైద్యులు డా॥ మద్దుల సత్యనారాయణగారు ఎం.బి.బి.ఎస్., ఎం.ఎస్., ఎం.పి.హెచ్. (న్యూరో సర్జన్) రామకృష్ణా నర్సింగ్‌హోం, పి.టి. ఎక్స్టెన్షన్ దావణగిరి (కర్నాటక) ఉచితంగా స్పైన్ ట్యూమర్ ఆపరేషన్ నిర్వహించగలరు. ప్రియదత్త పాఠకులు ఎవరైనా కుల, మత, వర్గరహితంగా ఈ సదవకాశం వినియోగించుకోవచ్చును. మందులు ఉచితంగా అందజేస్తారు.

వివరాలకు డా॥ ఎం.సత్యనారాయణ, ఫోన్ నెం.234386 (దావణగిరి)కు ఫోన్ చెయ్యండి. కింద ఇచ్చిన కూపన్ తీసుకుని వెళ్ళి ఈ సహకారం పొందవచ్చు.

మరిన్ని వివరాలకు శ్రీమతి కె.రత్నావతి, రాజమండ్రి 0883-2465583 కి ఫోన్ చెయ్యండి.

**-ఎడిటర్**

**ప్రియదత్త ఆర్య వైశ్య మహాసభ ఉచిత స్పైన్ ట్యూమర్ ఆపరేషన్ కూపన్**

**సంచిక తేదీ : 28-04-2004**

పేరు: ..................................................

వయస్సు : ............ స్త్రీ / పు ............ వృత్తి: ..................

చిరునామా : ..................................................

..................................................

.................................... పిన్‌కోడ్ : ..................

ఈ కూపన్ గలవారు సంవత్సరంలోగా
ఎప్పుడైనా ఉచిత ఆపరేషన్‌కు అర్హులు